క్లుప్తంగా

మహాత్మా.. మన్నించు



ఘంటసాల: దేశవ్యాప్తంగా గాంధీ జయంతి కార్యక్రమాలు వైభవంగా జరుగుతుండగా ఘంటసాల గ్రామంలో మాత్రం గాంధీ విగ్రహాలను పట్టించుకునేవారు లేక బోసిపోయాయి. ఘంటసాల గ్రామ పంచాయతీ, జెడ్పీ హైస్కూల్ ప్రాంగణాల్లో, జలధీశ్వర స్వామి ఆలయ ఎదురుగా గాంధీజీ విగ్రహాలకు బుధవారం ఆయన జయంతి సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, అభిమానులు ఒక్క దండ కూడా వేయక పోవడంతో విగ్రహాలు బోసిపోయి కనిపించాయి. గాంధీజీ పర్యటించిన గ్రామంగా చరిత్రలో ఉన్న ఘంటసాలలో మహాత్ముని జయంతి రోజున కూడా నివాళులర్పించక పోవడంతో మహాత్మా మన్నించు అంటూ పలువురు వాపోతున్నారు.

డివైడర్‌కు రంగులు దిద్దిన సీఎం

మచిలీపట్నంటౌన్: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం స్థానిక కోనేరు సెంటర్ సమీపంలోని సెంట్రల్ డివైడర్ గోడకు రంగులు దిద్దారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో బ్యూటిఫికేషన్ పనుల్లో భాగంగా డివైడర్‌ను అందంగా తీర్చిదిద్దే పనులు చేపట్టారు. సభా స్థలికి వెళ్లే సమయంలో మార్గంలో ఉన్న ఈ డివైడర్‌కు వేసిన బొమ్మలకు చంద్రబాబు రంగులు దిద్దారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, నారాయణ, కేపీ సారథి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు సన్మానం

గూడూరు: మండలంలోని కంకటావ పంచాయతీలో బుధవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ సర్పంచి మద్దాల వీర వెంకట మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో గ్రామంలోని 75 ఏళ్లు నిండిన 43 మంది వృద్ధులను సత్కరించారు. సర్పంచి మోహనరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా దేశవ్యాప్తంగా 750 పంచాయతీలను ఎంపిక చేయగా కృష్ణా జిల్లా నుంచి కంకటావను ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.రాజేశ్వరి, ప్రత్యేక అధికారి దేవానందం, పంచాయతీ కార్యదర్శి పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న కార్యదర్శికి వీడ్కోలు

చినకళ్లేపల్లి(ఘంటసాల): పంచాయతీ కార్యదర్శిగా వి.వెంకటేశ్వరరావు చినకళ్లేపల్లి గ్రామానికి అందించిన సేవలు అభినందనీయమని సర్పంచ్ గుత్తికొండ రామారావు (రాము) అన్నారు. మండలంలోని చినకళ్లేపల్లి సచివాలయంలో గాంధీ జయంతి, గ్రామ సభను బుధవారం సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి సర్పంచ్ నివాళులర్పించి గ్రామ సభ నిర్వహించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి వి.వెంకటేశ్వరరావును సన్మానించారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

మచిలీపట్నంటౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి.శ్రీరామ్, స్టార్ విద్యా సంస్థల డైరెక్టర్ బి.అయ్యప్పస్వామి బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రలకు రూ.85 వేల చెక్కులను అందజేశారు. రూ.50 వేలను వరద బాధితుల సహాయార్థం, రూ.35 వేలను అన్న క్యాంటీన్ నిర్వహణకు సాయాన్ని వారు అందజేశారు.

మంగినపూడిబీచ్‌లో స్వచ్ఛ సాగర్- సుందర్ సాగర్



చిలకలపూడి(మచిలీపట్నం): యువజన వ్యవహారాలు, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగినపూడిబీచ్‌లో స్వచ్ఛ సాగర్- సుందర్ సాగర్ పేరుతో మంగినపూడిబీచ్‌ను శుభ్రపరిచే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ జితేంద్ర సింగ్ ముఖ్యఅతిథిగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కృష్ణాజిల్లాలో నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తాము కూడా భాగస్వామ్యులం కావటం సంతోషంగా ఉందన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ సముద్రం వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించటం ద్వారా పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ఫణిదూర్జటి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి. బాలాజీ, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవి, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.శంకర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

- వాడవాడలా ఘనంగా గాంధీ జయంతి
- గాంధీ విగ్రహాలకు, చిత్రపటాల వద్ద నివాళులర్పించిన నేతలు, అధికారులు





అవనిగడ్డలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి : భాస్కరపురంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు, నాగరాజు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో గాంధీ జయంతిని బుధవారం ఘనగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలు వేసి నివాళుల ర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మచిలీపట్నంలో..

గాంధీ ఆశయాలు అనుసరణీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గాంధీ 155వ జయంతి బుధవారం నగరంలోని భాస్కరపురం సెంటరులో ఉన్న గాంధీ విగ్రహం వద్ద మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పేర్ని కిట్టు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ నాయకులు నివాళులర్పించారు. భాస్కరపురం సెంటరులోని గాంధీజీ విగ్రహానికి మతోన్మాద రాజకీయాల నుంచి దేశాన్ని కాపాడండంటూ వినతిపత్రం అందజేశారు. ఆర్కే కళాశాలలో గాంధీజీ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డి.శివరామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో..

గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణాభివృద్ధి సంస్థలో మొక్కలు నాటారు. బ్యాంకు రీజనల్ హెడ్ కే. వెంకట్రావు, డెప్యూటీ రీజనల్ హెడ్ రామలింగారెడ్డి, తాతాజీ, రీజనల్ విజిలెన్స్ చీఫ్ మేనేజర్ వెంకటరాజు, పట్టాభి సంస్థ నిర్దేశకులు గోపీనాథ్, యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కోతి సెంటర్‌లోని కొల్లిపర సత్రం గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు మహాత్మాగాంధీతో పాటు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు యెండూరి సురేష్, రంగనాయకులు, అన్నం అశోక్, వేముల శిరీష, వేముల కృష్ణ, జయవరపు ప్రసాద్, తమ్మన అనూరాధ, శ్రీదేవి, ప్రసాద్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

పెడన: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్చుతరావు, ఎంపీడీవో రెడ్డయ్య, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, టీపీవో సుజనాకుమారి, కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గాంధీ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. లింగం సుధాకర్, ఆకురాతి జనార్ధనరావు, కె.నాగభూషణం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడూరు: కోడూరు ప్రధాన సెంటర్‌లో వివిధ పార్టీల నేతలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, ఏఓ ఆకుల పాండురంగారావు, జూనియర్ అసిస్టెంట్ ఇంద్రాణి, సిబ్బంది పాల్గొన్నారు. కోడూరు పంచాయతీలో సర్పంచి వెన్నా షైనీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. నరసింహాపురం రహదారిలోని గాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల వద్ద సర్పంచులు, సిబ్బంది గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. కూటమి నేతలు కోడూరు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కొల్లూరి చిన్నా, శ్రీ వాసవి ప్రార్థన మందిరంలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు కొల్లూరి రాజా, కొల్లిపర నరసింహారావు, జవాజి నాగు, భవిరిశెట్టి రాఘవయ్య, ఉదయగిరి గోపాల్, కొల్లూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీక్షేత్రంలో ..

స్థానిక గాంధీక్షేత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మోపిదేవిలంక(మోపిదేవి): మండలంలో మోపిదేవి లంక పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మోర్ల జ్యోత్స్న గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగాయలంక: గాంధీజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నాగాయలంక ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ బి.జె.విఠల్ విహారి గాంధీజీ విగ్రహానికి, స్వచ్ఛ నాగాయలంక సొసైటీ అధ్యక్షుడు సింహాద్రి కృష్ణప్రసాద్ పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పించారు. చిట్టా శివనాగేశ్వరరావు, చిట్టా సాంబశివరావు, చిట్టా బాలపాపారావు, చిట్టా వెంకట శేఖర్, వంకాయల ఆది రాజేష్, విస్సంశెట్టి హరీష్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: గాంధీ జయంతిని మండలంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, మాజీ ఎంపీపీ వలవల సత్యనారాయణలు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. పిన్నెంటి రత్తయ్య, కూనసాని చిన్నా, ప్రత్తిపాటి రామాంజనేయులు పాల్గొన్నారు. గూడూరు: మండలంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కప్పలదొడ్డిలోని గాంధీ యువజన సంఘం ఆధ్వర్యంలో సర్పంచి యక్కల మాధవి గాంధీ ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అవనిగడ్డ: గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని గాంధీజీ, పొట్టి శ్రీరాములు, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహాలకు సింహాద్రి పూల మాలవేసి ఘననివాళులు అర్పించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, మండల కోఆప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, పులిగడ్డ పంచాయితీ కార్యాలయం వద్ద సర్పంచ్ దాసరి విజయకుమార్ గాంధీజీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.



మొక్కను నాటుతున్న యూనియన్ బ్యాంక్ అధికారులు



గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు



పెడన ఎంపీడీవో కార్యాలయంలో..



పెడన మున్సిపల్ కార్యాలయంలో..



పెడనలో గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న చిన్నా, తదితరులు



మోపిదేవిలంకలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ జ్యోత్స్న, తదితరులు



అవనిగడ్డ గాంధీక్షేత్రంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, తదితరులు



నాగాయలంకలో నివాళులర్పిస్తున్న విఠల్ విహారి, ఆర్యవైశ్య నాయకులు



గూడూరు తహసీల్దారు కార్యాలయంలో..



కృత్తివెన్ను మండల పరిషత్ కార్యాలయంలో..

శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో తర్పణలు

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం పుష్కర ఘాట్ బుధవారం మహాలయ అమావాస్య పితృరుణాలు పేరుతో పిండ ప్రదాన కార్యక్రమాలు జోరుగా నిర్వహించారు. పూర్వీకుల ఆశీర్వాద బలంతో పెండింగ్‌లో ఉన్న పనులు శీఘ్రమే సఫలం కాగలవన్న విశ్వాసంతో పండితులు సూచనల నేపథ్యంలో అనివార్య కారణాలతో శ్రార్ధకర్మలు చేయలేని వారికి పిండ ప్రదానం లేదా తర్పణం ఇస్తారు. సాగర సంగమ జలాలు పవిత్ర కృష్ణా జలంతో మిళితమైన ఈ ఘాట్ వద్ద 150 మందికి పైగా మహాలయ అమావాస్య పితృరుణ పిండ ప్రదానాలు చేశారు. మండలంలో 15 మంది పురోహితులు క్రతువులు నిర్వహించారు. మహాలయ పక్షం పురస్కరించుకుని పురాతనమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 18 నుంచి కొనసాగించిన స్వామివారి మహాలయ పక్షోత్సవ పూజలు బుధవారం ముగించారు.ఆలయ అర్చకుడు మహంకాళి ప్రకాష్ శర్మ నేతృత్వంలో సంప్రోక్షణ పూర్తి చేసి గురువారం నుంచి దసరా పూజలకు సిద్ధమయ్యారు.

వీధులు శుభ్రం చేసిన యువత

నాగాయలంక: రక్షణసైన్యం (సాల్వేషన్ ఆర్మీ) నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో సంస్థ స్థానిక రాజేశ్వరీ ఎస్సీ కాలనీలోని సంస్థ చర్చి ఆవరణలో వార్షిక యూత్ కౌన్సిల్ కార్యక్రమంలో భాగంగా బుధవారం యువతీ యువకులతో విస్తృత సమావేశం నిర్వహించారు. రక్షణ సైన్యం జిల్లా అధికారి మేజర్ తెలగతోటి ప్రసాదరావు, మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీనరత్నకుమారి నేతృత్వంలో దిండి, దీనదయాళపురం, దింటిమెరక, నల్లూరు, నాగాయలంక తదితర గ్రామాల యువతీ యువకులకు సామాజిక అవగాహన సదస్సు జరిపారు. అనంతరం స్వచ్ఛ భారత్ కింద కాలనీలోని వీధులను పరిశుభ్రం చేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన బాపట్లలోని విలియంబూత్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మేజర్ టి.శేఖర్ మాట్లాడారు. అభాగ్యుల సేవలు, సమాజహితంపై దిశానిర్దేశం చేశారు. డి.శ్యామ్ లింగ్‌స్టోన్ (బాపట్ల), రెవరెండ్ రవికుమార్ (చీరాల), మేజర్ జి.రత్నం, లెఫ్టినెంట్ రవి, అనిల్‌కుమార్, డి.జాన్‌రాజు బాలలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు సరుకుల పంపిణీ

ఘంటసాల: చేనేత కార్మికుల కుటుంబాలకు ఉత్తర అమెరికా పద్మశాలీ అసోసియేషన్, అఖిల భారత పద్మశాలీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువైన నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఘంటసాల గ్రామంలోని ఏపీ పద్మశాలీ సంఘం జనరల్ సెక్రటరీ అందె జగదీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 200 చేనేత కుటుంబాలకు ఈ సాయం అందించారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందిగట్ల స్వామి, ఏపీ పద్మశాలీ సంఘం కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు, సంఘం జనరల్ సెక్రటరీ జగదీష్ మాట్లాడారు. ఘంటసాల, యార్లగడ్డ, పురిటిగడ్డ, కాజ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది చేనేత కార్మికుల మగ్గాల గుంతల్లోకి నీరు చేరి ఉపాధి కోల్పోవడంతో జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి సాయం అందించామన్నారు. దాతలను ఆయా గ్రామాల చేనేత కార్మికులు ఘనంగా సన్మానించారు. అఖిల భారత పద్మశాలీ సంఘం ఇంజినీరింగ్ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా వేణుమాధవ్, ఉడతా చిత్తరంజన్ సాయి, గుత్తికొండ సత్యనారాయణ, కొడాలి శ్రీకాంత్, అక్కుల లీలాప్రసాద్, గోలి వెంకటేశ్వర్లు, శీలం నాగమల్లేశ్వరరావు, జంజనం రామ్మోహనరావు, విట్టంశెట్టి దుర్గారావు, కోదాటి కృష్ణమోహన్, తిరువీధుల వెంకటేశ్వరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

100 రోజులు పని కల్పించేందుకు కృషి

ఘంటసాల: ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ 100 రోజులపాటు పనులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఏపీవో రాజ్ కుమార్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఘంటసాల, చిలలపూడి గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో సర్పంచులు బి.వెంకటేశ్వరమ్మ, కొణతం విజయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ మంగమ్మ, సీవో, ఏపి బాలు, సువర్ణ, గొర్రెపాటి సురేష్, ఈవో టి.జయలక్ష్మి, ఎఫ్ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోసూరువారిపాలెం(మోపిదేవి): ఉపాధి హామీ పథకం పనుల ద్వారా ప్రజలకు అనుకూలంగా ఉండే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కోసూరువారిపాలెంలో బుధవారం సర్పంచ్ కోసూరు అనూష అధ్యక్షతన ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025- 2026 ఆర్థిక సంవత్సరానికి గుర్తించిన పనుల వివరాల ప్రాముఖ్యతను గ్రామ సభలో చదవి వినిపించారు. ఏపీడీ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు, కోసూరు శివనాగమల్లేశ్వరావు, టెక్నికల్ అసిస్టెంట్ హరిబాబు నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ కోసూరు రాజ్యలక్ష్మి, మేట్లు, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు

నాగాయలంక: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల ముగింపు, స్వచ్ఛ భారత్ దివస్ గ్రామసభ, ఉపాధి హామీ గ్రామసభ కార్యక్రమాలు బుధవారం నాగాయలంక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మండల ఈవోపీఆర్డీ కలపటపు అప్పల నరసమ్మ ఆధ్వర్యంలో తొలుత పారిశుద్ధ్య కార్మికులకు పరుగు పందెం జరిపారు. విజేతలైన ఉప్పలపాటి నాగదుర్గ, కోనేటి సుబ్రహ్మణ్యం, బందెల కృష్ణలకు బహుమతులు అందజేశారు. సీనియర్ పారిశుద్ధ్య కార్మికురాలు కత్తి లక్ష్మిని సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఉపసర్పంచి తలశిల నాని సన్మానించారు. పావులూరి సీతారావమ్మ వితరణతో పారిశుద్ధ్య మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ లంకె శ్రీనివాసప్రసాద్, గ్రేడ్-5 కార్యదర్శి సైకం రాధ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని భావదేవరపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి మండలి ఉదయభాస్కర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఏపీఓ టీవీఎస్ ముత్యాలు, గ్రామకార్యదర్శి పి.మల్లికార్జునరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మోపిదేవి: స్థానిక మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదకళ్లేపల్లి శ్రీదుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివార్ల దేవస్థానంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ సిబ్బందిని ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు బుధవారం ఘనంగా సన్మానించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు గత నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయింతి వరకు నిర్వహించి ఆలయాన్ని, ఆలయ ప్రదేశాలు, క్యూలైన్లను శుభ్రపరిచారు. పెదకళ్లేపల్లి ఆలయ ప్రాంగణంలో మామిడి, జామ, కొబ్బరి మొక్కలు నాటించారు. స్కావెంజర్లు, స్వీపర్లను దేవస్థానం తరపున సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ వర్క్‌లో శిక్షణ పూర్తి

పెడన: పట్టణంలో సహాయ ఫౌండేషన్ ద్వారా 8వ బ్యాచ్‌లో ఉచితంగా కుట్టు, మగ్గం, ఫ్యాషన్ డిజైనింగ్ వర్క్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బుధవారం సర్టిఫికెట్స్‌ను అందజేశారు. స్థానిక గుడివాడ రోడ్డులోని షాదీఖానాలో జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ 8వ బ్యాచ్‌లో 72 మంది రెండు నెలలు పాటు శిక్షణ పొందారన్నారు. ఈ శిక్షణ కాలంలో షాదీఖానాను ఉచితంగా కమిటీ వారు అందజేసినందుకు కృతజ్ఞతలను తెలిపారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, విద్య విభాగం కమిటీ చైర్మన్ మట్టా రాధాకృష్ణ మూర్తి, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాద్, కోన వెంకటేశ్వరమ్మ, ట్రైనర్స్ రామినేని దుర్గా, ఓ.లక్ష్మీశిరిషా, అబ్దుల్ ఖుద్దూస్, అల్లాడ శ్యామల, సూదాబత్తుల లక్ష్మి, చలమలశెట్టి హేమలత, బడుగు ఉమ, మల్లికా, సుమంత్, తుమ్మల వర ప్రసాద్, దుర్గా, జయలక్ష్మి, లావణ్య, బాల పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శివాలయాలు, వైష్ణవాలయాల్లో గురువారం నుంచి దేవీశరన్నవరాత్రులు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బంటుమిల్లి కనకదుర్గానగర్‌లో శ్రీకనకదుర్గా అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారాలతో విశేష పూజలు నిర్వహించనున్నారు. బంటుమిల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి గుడి, పెద తుమ్మిడి శివాలయం, ముంజులూరు ఆంజనేయస్వామి దేవాలయం మందిరం వద్ద, మల్లంపూడి, చోరంపూడి గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలను నిలిపి సామూహిక కుంకుమపూజలు నిర్వహించనున్నారు. ఆర్తమూరు, మల్లేశ్వరం, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో దేవీనవరాత్రులను అమ్మవారి అలంకారలతో, సామూహిక కుంకుమ పూజలతో నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకల్లేపల్లిలో శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో తొలిరోజు 3వ తేదీ గురువారం ఉదయం శ్రీ స్వామివారు, అమ్మవార్లకు స్నపనాభిషేకం అనంతరం ఉదయం 10 గంటలకు దర్శనం ఉంటాయన్నారు. చివరి రోజు 12వ తేదీ శనివారం విజయదశమి నాడు రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారు, శ్రీ అమ్మవార్ల గ్రామోత్సవం, శమీపూజలు ఉంటాయని వివరించారు. ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో చండీ అనుష్టానం, పంచాక్షరీ అనుష్టానం, బాలా మంత్ర అనుష్టానం జరుగుతుందని శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు.